

# ఏది అసలైన న్యాయం?

ఆడిగోపుల వెంకటరత్నమ్

ఆరోజు యూనివర్శిటీ ఆర్ట్సు కాలేజి ప్రిన్సిపాల్ సీతాపతిగారి భార్య హత్యకేసు తీర్పు.

కోర్టు వెలుపల మౌనంగా చెట్టుక్రింద నిలబడి ఆలోచిస్తున్నాను. నేనాలోచించేది నాకే తెలియడంలేదు. ఒకదాని కొకటి గజిబిజిగా అల్లుకపోతున్నాయి. మధ్యలో నేనేదో ఊహల్తో ఆడుకొంటూ కేరింతలు కొడ్తున్నాను.

ఉలిక్కిపడి తల తడుముకొన్నాను. ఆకు చేతికి దొరికింది. ఇంకా పచ్చగా వుంది. అప్పుడే రాలిపోయిందే పూర్తిగా పండకముందే సనుకొంటూ. ఆ ఆకును ఎడమ చేతిలో వుంచుకొని తలెత్తి పైకి చూచాను. ఎంత ప్రతిఘటించినా అప్పుడప్పుడూ కోర్టులో ప్రత్యక్షం అయ్యే న్యాయంలాగా సూర్యకాంతిని ఆవరణలోపడకుండా యీ చెట్లు ఎంతప్రయత్నించినా పొడలు పొడలుగా చొచ్చుకు వస్తూంది.

న్యాయం నిదురపోయింది. ఎంత బాగా చెప్పారు!

కాని చచ్చిపోలేదు. అందుకే యీ రోజు నిదుర లేస్తుందని నా నమ్మకం. ఒక్కసారి లేచి అలా కళ్ళు తెరిస్తే చాలదూ నా తండ్రిలాంటి సీతాపతిగారిని రక్షించుకోడానికి!

ఆయనకు శిక్ష! ఛ!! ప్రపంచం ఆగిపోదూ, నా పిచ్చిగాని ప్రపంచం ఆగిపోవడమేమిటి, ఇలాంటి మహానుభావులందరికి యీ స్థితి వచ్చినప్పుడు ప్రపంచం ఆగిపోయిందా, తన గమనంలో ఒక్కసారి ఆవలించి వెళ్ళిపోలా!

సీతాపతిగారు తన భార్యను హత్యచెయ్యడమా? హత్యంటే అసలు నిర్వచనం ఇవ్వగలరా ఆయన, నాకు నవ్వు వస్తూవుంది ఆయన హత్యచేశారంటే.

అది ఆత్మహత్య... నాకు తెలుసు.

క్షయతో బాధపడుతున్న ఆమె పిస్టల్ కణతకు పెట్టి పేల్చుకొని ప్రాణం తీసుకొంది.

ఆత్మహత్యను హత్యగా - హత్యను ఆత్మహత్యగా ఎలాగైనా నిరూపించవచ్చు న్యాయస్థానాల్లో.

చిన్నప్పుడే తలి దండ్రుల్ని పోగొట్టుకొని దిక్కులేని నన్ను సీతాపతిగారు చేరదీసి పెంచి ఎంతో ఆప్యాయంగా చూచుకొంటూ చదువు చెప్పించి నన్నింతవాణ్ని చేశారు. సీతాపతిగారి కుమారుడు చక్రవర్తి - నా ప్రాణ స్నేహితుడు. అతడు లాయరై మంచి ఖ్యాతి సంపాదించాడు. నేను ఇంజనీరునై కాన్ఫిడెన్షియల్ రిపోర్ట్సు కోసం ప్రాకులాడుతున్నాను.

తండ్రి కేసులో తనయుడు చక్రవర్తి వాదించడం! తప్పక న్యాయాన్ని సాధిస్తాడు.న్యాయాన్ని నిదురలేవగొట్టి కోర్టులోనున్న ప్రజలకు ఆ దివ్య తేజస్సుని ఒక్కసారి చూపిస్తాడు. నా కంతేచాలు. సీతాపతిగారు రావాలి, నన్ను ఆప్యాయంగా కౌగలించుకోవాలి. నా స్నేహితుడుఖ్యాతి పెరిగిపోవాలి.

నా పిచ్చిగాని న్యాయశాస్త్రం బాణం లాంటిది కదూ! ఎవరు గురిచూచి కొడితే అది గుర్తును తాకుతుంది. చక్రవర్తి బాణం సరిగా గుర్తును తాకకపోతే! చుట్టూ ఏమిటీ పిశాచాలు - అబ్బా! స్మశానంలో వున్నానే!

కోర్టుకు వేళయింది. వెళ్ళాలి. రెండడుగులు ముందుకు వేశాను అరె! ఇదే కోర్టు. వీళ్ళంతా ఈ కేసు కోసం వచ్చిన ప్రజలు. ఈనాడున్న ఆతృత రేపుండదువీళ్ళలో. నాక్కూడా అంతేనా? అంతేనేమో. లేకపోతే ప్రపంచం ఎలా నడుస్తుంది?

న్యాయాన్ని కొన్ని పుస్తకాల్లో బంధించాడు. దేవుణ్ని గుళ్ళో బంధించినట్లు, దేవుడు ఎవరికో ఒకరికిఎప్పుడో ప్రత్యక్షమయినట్లు కొందరికి న్యాయంకూడా అప్పుడప్పుడు ప్రత్యక్షం అవుతుంది

దోషిని నిర్దోషని నిరూపించడం ఎంత సులభం!

నిర్దోషిని నిర్దోషని అనిపించడం ఎంతకష్టం!

కంటికి దగ్గర వేలు పెట్టుకొని చూస్తే ప్రపంచం కనిపించదు. అలాగే కేసుకు ఎక్కడో ఒక చిన్న పొరపాటు కల్పిస్తుంది. దాన్ని కంటి దగ్గర పెట్టుకొంటారు. ఇక ఏమీ కనిపించదు.

న్యాయమూర్తి స్టేటుమెంటును చదువుతున్నారు.

ఇదేమిటి ఈయన స్మశానంలో ఒక్కరే చదువుతున్నారు. వీళ్ళంతా ప్రజలు. ఎంత నిశ్శబ్దం! ఎంత నిగ్రహశక్తి! చనిపోయిన వాళ్ళకు - వీళ్ళకు భేదమేమిటి.

న్యాయమూర్తి తన స్టేటుమెంటును చదివి ముగించాడు.

ఆనందంతో చప్పట్లు కొట్టాను. నా కడ్డంగా వున్న ప్రజల్ని త్రోసుకొంటూ ముందుకు పోతున్నాను. హరిశ్చంద్ర నాటకంలో కాటిసీను నా కళ్ళకు కనిపిస్తూవుంది. అందర్ని త్రోసుకొంటూ ముందుకు వెళ్ళి చక్రవర్తి దగ్గరకు వెళ్ళాను.

అతను కన్నీరు కార్చడం చూసి రాయిలా నిలబడ్డాను.

కొందరిమీద అభిమానం, అనురాగం, కొన్ని మాటల్ని ఎలా మింగేస్తుంది. స్వప్నలోకంలో వుండి జడ్జిమెంటు ఎంత తప్పుగా అర్థం చేసుకొన్నాను! నా తండ్రికి ఉరిశిక్ష!!

బోనులో వున్న సీతాపతిగారు న్యాయమూర్తికి పైన తగిలించి వున్న మహాత్ముని పటము చూస్తున్నారు. ఆయన యిదేమీ నాకు తెలియదన్నట్లు ఒక ప్రక్కకు చూస్తున్నాడు.

ఈసారి సీతాపతిగారు న్యాయమూర్తికి ఎదురుగా వున్న బుద్ధుని పటము చూస్తున్నారు. మీ లాంటి వ్యక్తుల కోసమే నా ఆత్మ యింకా తపస్సు చేస్తూవుంది అన్నట్లుగా మౌనంగా తపస్సులో నిమగ్నమై వున్నాడు. మీ తపస్సు ఫలించే వరకు మే మందరం అగ్నిహోత్రంలో పడవలసిందేనా స్వామీ? ఓహో, మమ్మల్ని కూడా మీ తపస్సుకు సహకరించమంటారా!

నా భుజంపై కన్నీరు కారుస్తున్న చక్రవర్తిని ఓదార్చలేకపోయాను. లోయలోపడి కాళ్ళు చేతులు విరిగి మెలికలు తిరిగిపోతున్న నన్ను ఓదార్చే దెవరు ?

ఎంతసేపయింది యిక్కడ నిలబడి సీతాపతి గార్ని తీసుకు వెళ్ళారే ! ...

నా కిప్పుడు వయస్సు మీరిపోయింది. జరిగే దానికి ఎదురు నిలబడ లేమన్నది నా ఈ వయస్సులో తెలుసుకొన్న సత్యం. అందుకే దేనిని గూర్చికూడ అంతగా పటించుకోవడంలేదు. ఇప్పుడు నేనెంతో పెద్ద హోదాలో వున్నాను.

ఆ నాడు నా తండ్రి సీతాపతిగారికి శిక్ష విధించిన న్యాయమూర్తి పురుషోత్తమరావు గారి భార్య హత్యకేసు తీర్పు ఈ రోజు. ముద్దాయిరైన పురుషోత్తమరావుగారి తరఫున ఆయన కుమారుడే వాదిస్తున్నాడు.

ఎంత విచిత్రం ! ఆ నాడు చక్రవర్తి తన తండ్రి కోపం కిల్తానాన్ని వెదజల్లితే ఎదుకొని కాళ్ళ క్రిందత్రొక్కి పెట్టారు.

ఈ నాడు ఈ కేసుకు నా చక్రవర్తి న్యాయమూర్తి

ప్రతీకారం తీసుకొంటాడా ? కాదు.

న్యాయాన్ని నిదుర లేపుతాడు.

తన బుద్ధి కౌశల్యంతో న్యాయానికి సంకెళ్ళు విడిపించి వెలుగు చూపుతాడు.

పురుషోత్తమరావుగారి భార్య ఈ వయస్సులో కొత్త కలాపాలు సాగించింది ... అది నాకు తెలుసు.

పురుషోత్తమరావుగారు ఆమెను హత్య చేశారు. అందులో అనగింజంత పొలులేదు. అది నా స్నేహితుడు రవివర్మ చూచి సాక్ష్యం చెప్పాడు.

కొన్ని సంవత్సరాలనాడు ఇదె కోర్టులో సీతాపతిగారి కేసు రోజున ఎక్కడ నిలబడ్డానో ఇప్పుడూ అక్కడే నిలబడ్డాను.

ఉలిక్కిపడి తల తడుముకొన్నాను. బట్టతలపై నుండి అను జారి క్రింద పడబోతుంటే పట్టుకొని చూచాను. పండుటాకు. మనసులో నవ్వుకొంటూ కోర్టు రూముకు వెళ్ళాను.

"... పై కారణాల వల్ల ఉరిశిక్ష విధించడమైనది" అంటూ తన తీర్పును న్యాయమూర్తి గంభీరంగా చెప్పాడు.

"ఇది ప్రతీకారం" నా ప్రక్కనే నిలబడివున్న వ్యక్తి గొణిగాడు.

న్యాయమూర్తికి పైన తగిలించియున్న మహాత్ముడి చూచాను. బోసినవ్వులతో కోర్టంతా చూస్తున్నాడు.

అటు చూచాను - ఈనాడు నా తపస్సుకు కొద్దిగా ఫలితం కన్పించిందంటూ మందస్మితంగా మౌనముద్రలో మునిగిపోయాడు బుద్ధభగవానుడు.

ఆనాడు బాధతో నిలబడ లేకపోయాను.

ఈనాడు వార్ధక్యం వల్ల నిలబడలేక పోతున్నాను.

ఆ నాడు తప్పు చెయ్యని సీతాపతిగారి కేసులో తీర్పు ఇచ్చింది న్యాయమే. ఈ నాడు తప్పు చేసిన పురుషోత్తమరావుగారి కేసులో ఇచ్చింది న్యాయమే.

రెండు న్యాయాలు - కాని కోర్టు మాత్రం ఒక్కటే.

నా అడుగులు ముందుకు వేశాను. ఎడమ చేతిలోని ఆకును చూచి ఆనందంతో విసిరివేశాను. ఆ చెట్టు క్రింద వేల సంఖ్యలో వున్న ఆకుల్లో కలిసిపోయింది

అబ్బా ! నా బట్టతల ఎండిపోతూ వుంది. సూర్యుడికి కూడా సంతోషం కాబోలు. ★

# వాన

– "శ్యాంజీ"

ఎటూ పోనివ్వని గాలి
ఎటూ చోటివ్వని చలి
ఒకే ఛేటీగా, ధాటీగా
గట్టివానను
ఉంచగా, పెంచగా
పుట్టుకువచ్చిన
పరిస్థితి - అది.

* * *

అప్పుడే
ఓడదిగిన యాత్రికులు
జాడ తెగిన ఉత్తరాల్లాగా,
అక్కడే
మెదిగిన విడిదిలో
పొదిగిపోయారు.
ఆ 'షిప్' లోని
ఆయనే
ఒక - 'బిషప్'

* * *

ఆదశలో
ఆబసలో
ఆయనకు -
ఒక దుర్దశలోని
ఒక వేశ్య
ప్రముఖ వయస్య -
దృశ్య మయినదప్.

* * *

ఆమె పడుపు
కడుపుకోసం
ముడుపుకోసం
పడుపు వేసం
నడుపుతోన్న
పొడుపురాలు,
పడుపుగాలు

* * *

ఆమె పతిత
సతతం పాప
పంకిలంతో
సంతరించుకు
పోతోన్న
పతిత;
పాపచరిత

* * *

నేరుగా, నేర్పుగా
తీరుగా, తిర్పుగా
తిలకించే సరికి,
పలికించేసరికి -
సతిమత చెలరింది;
సానుభూతి చిప్పరింది
అతని మతి సారించింది;
మత నిరతి పూరించింది

* * *

ఆ పాపిని, ఆ పాదిని
పరిశుద్ధించాలి పూర్తిగా
ఉద్ధరించాలి విస్ఫూర్తిగా -
- అనుకున్నాడు గాఢంగా,
- పూనుకున్నాడు దృఢంగా

* * *

అయితే
అంత ఊగిన ఆయన
ఎంతో జోగి పోయాడు
అంత జాలిపడిన ఆయనా
ఎంతో జారిపడినాడు
అనగా
ఆవేశ్యకే
తిన్నగా -
'వశ్యం'
అయిపోయాడు

(ఇందుకొక్కకారణం: ఆ బిషప్ తప్పు గాదు. ఆవేశ్య గొప్పగాదు. తప్పునిసతి అని చెప్పుతూన్న ఆ వానతీతిలోని పరిసితి ప్రభావమేనని, మహానుభావుడు 'సోమర్సెట్ మామ్' తన 'రెయిన్' కథలో ఫయిన్‌గా సూచించాడు. ఆయనకు తలవొగ్గుతూనే తగ్గింపుగా తయారించిన 'తెనిగింపు' ఇది)